సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 16 । మే । 2025



...'ఆడ'నే చంపేస్తాం!

చిత్తూరు నగరం లింగనిర్ధారణకు అడ్డాగా మారింది. అధికారుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. - 8లో



వసతుల కల్పనలో..

పర్యాటకులకు సరైన వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. - 8లో



రోగులకు మెరుగైన వైద్యం

ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి సుధారణి ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్‌పీకేఎం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి జిల్లా ఎస్‌పీకేఎం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో 53 సీట్లు, తమిళనాడు రాష్ట్రం సేలంలో 12, కర్ణాటక రాష్ట్రం గడగ్‌లో 2 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. సంబంధిత శిక్షణ కేంద్రాల్లో మూడేళ్ల పాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఈ శిక్షణలో చేరదలిచిన వారు 10వ తరగతి, తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. బీసీ, జనరల్ కేటగిరిలో జూలై 1వ తేదీ నాటికి 15 నుంచి 23 సంవత్సరాల మధ్య వయస్సు, ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. మూడేళ్ల కోర్సులో ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఒకేషనల్ (టెక్స్‌టైల్స్), ఐటీఐ (రెండేళ్లు) కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు www.iihtvgr.com వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కలెక్టర్ కోరారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఏ అధికారిణి శ్రీదేవి

శ్రీరంగరాజపురం : మండలంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని డీఆర్‌డీఏ అధికారి శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. మహిళలకు ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏపీఎం రోజా, టైలరింగ్ శిక్షణ అధికారి గీతాకుమారి, భాను పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయ లక్ష్యం రూ.980.17 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్ శాఖ చిత్తూరు, తిరుపతి జిల్లాల 2025–26 ఆదాయ లక్ష్యం రూ.980.17 కోట్లుగా నిర్ణయించినట్టు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ గిరిబాబు తెలిపారు. ఆయన గురువారం చిత్తూరులో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా వార్షిక ఆదాయ లక్ష్యం రూ.762 కోట్లని తెలిపారు. అందులో అత్యధికంగా రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.153 కోట్లు, అత్యల్పంగా చిన్నగొట్టిగల్లు కార్యాలయానికి రూ.6.73 కోట్లు లక్ష్యంగా పెట్టినట్టు తెలిపారు. చిత్తూరు జిల్లాలో రూ.218.17 కోట్లు లక్ష్యం కాగా అత్యధికంగా చిత్తూరు అర్బన్ (ఆర్వో) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.77.79 కోట్లు, అత్యల్పంగా కార్వేటినగరం కార్యాలయానికి రూ.10.88 కోట్లుగా నిర్దేశించినట్టు వెల్లడించారు. గత సంవత్సరం తిరుపతి జిల్లా ఆదాయ లక్ష్యం రూ.626 కోట్లు కాగా రూ.521 కోట్లు వచ్చిందన్నారు. చిత్తూరు జిల్లా లక్ష్యం రూ.181.78 కోట్లు కాగా రూ.144.50 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు.

19న వైస్ ఎంపీపీ ఎన్నిక



తవణంపల్లె మండల పరిషత్ కార్యాలయం

తవణంపల్లె: తవణంపల్లె మండల వైస్ ఎంపీపీ ఎన్నిక కోసం ఈనెల 13న నోటిఫికేషన్ జారీ చేసినట్లు స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓ, అసిస్టెంట్ ఎన్నికల అధికారి రాఘవేంద్రరాజు తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీపీఓ సుధాకర్ పర్యవేక్షణలో ఈనెల 19న సోమవారం ఉదయం 11 గంటలకు చేతులు ఎత్తే పద్ధతిలో తవణంపల్లె మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని 15 ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. మండలంలో మొత్తం 14 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఉండగా.. ఒకరు టీడీపీ ఎంపీటీసీ ఉన్నారు. వైస్ ఎంపీపీ ఎన్నికలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

కాపుగాసి.. దోచేసే కుట్ర!



జిల్లాలో కూటమికి చెందిన గుజ్జు పరిశ్రమలు మామిడి రైతులకు షాకిస్తున్నాయి. అధిక ధరకు కాయలు కొనుగోలు చేసి తక్కువ ధరకు తెచ్చినట్టు విషప్రచారం చేస్తున్నాయి. ప్రస్తుతం కోత దశకు వచ్చిన కాయలను కూడా తక్కువ ధరకే కొనుగోలు చేయాలని కుయుక్తులు పన్నుతున్నాయి. ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లోని రేట్లను బూచీగా చూపి రైతులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. రోజురోజుకీ మామిడి ధరలు తగ్గించేస్తూ అన్నదాతను ఆందోళనలోకి నెట్టేస్తున్నాయి. ఈ విషప్రచారంపై కూటమి ప్రభుత్వం స్పందిస్తుందో.. లేదా రైతులను నట్టేట ముంచేసి నేతలకు వత్తాసు పలుకుతుందో వేచి చూద్దాం మరి!

మామిడి రైతులను అయోమయానికి గురిచేస్తున్న గుజ్జు పరిశ్రమలు

- బయట మార్కెట్లో తక్కువ ధరకు తెచ్చినట్టు విష ప్రచారం
- అదే ధరకు ఇక్కడి కాయలు కొనుగోలు చేయాలని పన్నాగం
- కోతకు రాకముందే కూటమి నేతల కొత్త ప్రయోగం
- గందరగోళానికి గురవుతున్న అన్నదాతలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలో 56 వేల హెక్టార్ల మేర మామిడి సాగవుతోంది. మొత్తం 54,7320 మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చేది. అయితే ఈ సారి అన్ని రకాలు కలిపి 6,45,234 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి రావొచ్చని అధికారుల అంచనా. ఇందులో టేబుల్ రకం 16,105 హెక్టార్లకు గాను 1,45,960 మెట్రిక్ టన్నులు, తోతాపురి 39,895 హెక్టార్లకు 6,45,234 టన్నుల వరకు రావొచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం టేబుల్ రకాలు కోతకొచ్చాయి. కాయలు కోసి రైతు మార్కెట్‌కు చేరుస్తుండగా.. అక్కడి రేట్లు చూసి దిగాలు చెందుతున్నారు.

భారీగా దిగుమతి

గత నెల నుంచి జిల్లాలో కొన్ని గుజ్జు పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. కేరళ నుంచి అల్ఫోన్సో రకం కాయలను దిగుమతి చేసుకుని గుజ్జు తయారీని ప్రారంభించాయి. మొదట్లో రోజుకు 90 టన్నుల వరకు దిగుమతి చేసుకునేవి. ఇప్పుడు ఈ రకం కాయలు 150 టన్నులకు పైగా దిగుమతి చేసుకుంటున్నాయి. ప్రస్తుతం విజయవాడ నుంచి తోతాపురి రకం కాయలను దిగుమతి చేసుకోవడం ప్రారంభించాయి. అక్కడ రాలిపోయిన కాయలను కూడా వదలడం లేదు. విజయవాడలో తోతాపురి కేజీ రూ.11కు కొనుగోలు చేసి ఇక్కడ రూ.7, రూ.8కే కొనుగోలు చేశామని కొన్ని గుజ్జు పరిశ్రమలు ప్రచారం చేసుకుంటున్నాయి. ఇదంతా కూటమి పార్టీకి చెందిన పరిశ్రమదారులు చేస్తున్న విషప్రచారమేనని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రైతుల కష్టాన్ని జ్యూస్‌లాగా పిండేయాలని చూస్తున్నారని మండిపడుతున్నారు. జిల్లాకు చెందిన ఓ కీలక మంత్రికి మంచి ఆఫర్ ఇచ్చి మామిడి ఫలాన్ని దోచుకునేందుకు కుట్రపన్నినట్టు చెబుతున్నారు.

రైతుల్లో గుబులు

గతంలో కంటే ఈసారి మామిడి దిగుబడి పర్వాలేదనిపిస్తోంది. కొన్ని చోట్ల మంచి దిగుబడి కూడా వస్తోంది. కాయలు కూడా నాణ్యవంతంగా ఉన్నాయి. టేబుల్ రకాలతోపాటు తోతాపురి కూడా మంచి సైజు వచ్చింది. తోతాపురి పది రోజుల్లో కోత కోసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో మామిడి ధరలు ఆరంభంలోనే తగ్గించేయడంతో పలువురు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మరో వైపు పల్ప్ ఎగుమతుల ప్రభావం, యుద్ధాలు, బ్యాంకు రుణాలు, ఇతరత్రా సమస్యలను సాకుగా చూపిస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ గందరగోళ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా సమాచారం

మామిడి రకం	హెక్టార్లు	దిగుబడి అంచనా మెట్రిక్ టన్నుల్లో
తోతాపురి	39,895	49,9274
నీలం	5,818	64,991
అల్ఫోన్సో	3,127	26,404
బేనీషా	3,895	28,867
మల్లిక	1,740	13,919
ఇతర రకాలు	1,526	11,779



చిత్తూరు మార్కెట్‌కు వచ్చిన మామిడి కాయలు

చిత్తూరు మార్కెట్లో ధరలు

రకం	కిలో ధర రూ.
బెనీషా :	30
చందూర :	11-20
అల్ఫోన్సో :	25
తోతాపురి :	8
రాలిపోయిన తోతాపురి :	4-6

తమిళనాడు క్రిష్ణగిరి మార్కెట్లో..

రకం	కిలో ధర రూ.
తోతాపురి :	10-15
బెనీషా :	30-35
చందూర :	15-25
అల్ఫోన్సో :	30
రాలిపోయిన తోతాపురి :	8

అన్యాయం చేయొద్దు



ఎకరాకు పైగా మాకు మామిడితోట ఉంది. అప్పు చేసి ప్రతిసారీ పంటను కాపాడుకుంటూ వస్తున్నాం. ఈ సారి పంట బాగానే వచ్చింది. గాలీవానకు కొంత నష్టమైంది. ఉన్న పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నాం. ఈ సమయంలో రేట్లు తగ్గించేయడం విడ్డూరంగా ఉంది. ధర నిర్ణయం విషయంలో రైతులకు మేలు చేకూరాలి. ఆ రకంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

–వెంకటేష్, ఎస్ఆర్‌పురం మండలం

రైతులకు గిట్టుబాటయ్యేలా చూస్తాం



తోతాపురి రకం కోతకొచ్చేందుకు 10, 15 రోజులు పడుతుంది. బయట జిల్లాలకు సంబంధించిన కాయలను కొనకూడదని ఫ్యాక్టరీ యజమానులకు చెప్పాం. వాళ్లు కూడా సహకరిస్తున్నారు. ఈ సారి దిగుబడి, నాణ్యత బాగుంది. రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తాం. రైతులను ఇబ్బంది పెట్టించాలని చూస్తే కచ్చితంగా చర్యలు చేపడుతాం.

– మధుసూదన్ రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, చిత్తూరు

పకడ్బందీగా పది సప్లిమెంటరీ





మాట్లాడుతున్న పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, సమావేశంలో పాల్గొన్న చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 19వ తేదీ నిర్వహించే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో పది సప్లిమెంటరీ, ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 36 కేంద్రాలు ఏర్పాటు చేయగా దాదాపు ఏడు వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్ల చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు తప్పనిసరిగా విధులకు హాజరుకావాలన్నారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఇంటర్ పరీక్షలకు 9, పది పరీక్షలకు 12 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 2,182, పది పరీక్షలకు 670 మంది మొత్తం 2,852 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. డీవైఈవో ఇందిరా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యాశాఖ ఏడీ–1 సుకుమార్, పరీక్షల డీఈసీ మెంబర్ శశిధర్, డీఈవో కార్యాలయ పరీక్షల విభాగం సిబ్బంది సల్లార్‌ఖాన్, మధు, చీఫ్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్ ఫలితాల్లో 91.53 శాతం ఉత్తీర్ణత

చిత్తూరు కలెక్టరేట్ : ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈసెట్ (ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఫలితాల్లో చిత్తూరు జిల్లాలో 91.53 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా వ్యాప్తంగా 377 మంది దరఖాస్తు చేసుకోగా 366 మంది హాజరయ్యారు. పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో పురుషులు 203, మహిళలు 132 మొత్తం 335 మంది అర్హత సాధించారు. ఈ పరీక్షల్లో పురుషులు 89.82, మహిళలు 94.29 మొత్తం 91.53 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 35 పరీక్ష కేంద్రాల్లో నాల్గవ రోజు గురువారం ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా సాగినట్లు డీఐఈవో డా.ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం నిర్వహించిన మొదటి సంవత్సర పరీక్షకు జనరల్ విభాగంలో 5,767 మందికిగాను 5,572 మంది విద్యార్థులు హాజరు కాగా 195 మంది గైర్హాజరయ్యారని, వొకేషనల్ విభాగంలో 286 మందికిగాను 259 మంది హాజరుకాగా 27 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షలో 910 మందికి గాను 869 మంది, వొకేషనల్ విభాగంలో 112 మందికి గాను 103 మంది హాజరైనట్టు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ జనరల్, ఒకేషనల్ కళాశాలలను తనిఖీ చేయగా, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దయానందరాజు, బాలసుబ్రహ్మణ్యం, శరత్‌చంద్రశేఖర్ ఆయా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారని వెల్లడించారు.



పీసీఆర్ వొకేషనల్ కళాశాలను తనిఖీ చేస్తున్న డీఐఈవో శ్రీనివాసులు

భూములన్నీ లాగేసుకుంటున్నారన్నా!

- మాజీ సీఎంను కలిసిన ఎయిర్‌పోర్టు బాధితులు



మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

శాంతిపురం: 'కుప్పం విమానాశ్రయం కోసం గతంలో సేకరించిన 1,100 ఎకరాలు.. ఇప్పుడు అదనంగా మరో 700 ఎకరాలు సమీకరిస్తున్నారు. ఉన్న భూములు లాక్కుంటే మేం ఊరొదిలి వెళ్లాల్సిందేనన్నా' అంటూ ఎయిర్ పోర్ట్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. గతంలో విమానాశ్రయం, టైడల్ పరిశ్రమ, హంద్రీ–నీవా కాలువ, గ్యాస్ పైప్‌లైన్ కోసం తాము భూములు ఇచ్చామని చెప్పారు. మిగిలిన కొద్దోగొప్పో భూములను కూడా ఇప్పుడు ప్రభుత్వం తీసుకుంటే తాము గ్రామాలు వదిలి వలసి వెళ్లాల్సిందేనని కన్నీటిపర్యంతమయ్యారు. దీనిపై స్పందించిన మాజీ సీఎం రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయాలని చెప్పారు. దీనిపై ప్రభుత్వం అధికారికంగా పూర్తి స్థాయిలో స్పందించిన తర్వాత తమ స్టాండును తెలియజేస్తామన్నారు. రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్, పార్టీ నాయకులు విజలాపురం బాబు, చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.

నేడు జిల్లాలో జల వనరుల శాఖా మంత్రి పర్యటన

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నుంచి బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం హంద్రీ–నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్దకు చేరుకుంటారన్నారు. ఆ కెనాల్‌లో 49.50 కి.మీ వద్ద చేపడుతున్న కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు కుప్పం నియోజకవర్గంలోని పాలార్ నది పై నిర్మిస్తున్న డబుల్ లెవెల్ రోడ్డు బ్రిడ్జి పనులను పరిశీలిస్తారన్నారు. అ తర్వాత సాయంత్రం 5.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి తమిళనాడు రాష్ట్రం జోలార్ పేట రైల్వే జంక్షన్‌కు చేరుకుని విజయవాడకు బయలుదేరి వెళ్తారని కలెక్టర్ వెల్లడించారు.

హామీలు అటకెక్కించి.. అభివృద్ధిని విస్మరించి!

ఎన్నికల హామీలు నెరవేర్చని చంద్రబాబు

- అక్రమ వ్యాపారాలే కూటమి ప్రభుత్వ అజెండా
- కుప్పానికి రూ.1200 కోట్ల పనులు ఎక్కడ?
- ఏడాది పాలనపై కుప్పం ఎమ్మెల్సీ భరత్ ధ్వజం

సాక్షి ఇంటర్వ్యూ



భరత్, కుప్పం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ

కుప్పం: 'ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలతో రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయలేదు.. విద్య, వైద్యం అందక పేదలు అల్లాడిపోతున్నారు. తన సొంత నియోజకవర్గం కుప్పంలో అభివృద్ధి జాడేలేదు. సమయం వచ్చినప్పుడు ప్రజలు కూటమి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు' అని కుప్పం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏడాది పాలనపై ఆయన గళం విప్పారు. ఇంకా ఏమన్నారంటే..!

తుస్‌మన్న సూపర్ సిక్స్

ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయకపోగా, వాటిపై ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనని చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. తన స్వార్థం కోసం దేవుళ్లను కూడా రాజకీయాలకు వాడుకుంటున్నారు. ప్రశ్నిస్తే కేసులు బనాయిస్తారని భయభ్రాంతులు సృష్టిస్తున్నారు. ఎక్కడ చూసినా అక్రమాలు, అక్రమార్జనే టీడీపీ ఎజెండాగా మారిపోయింది. విచ్చలవిడిగా దోచుకుతింటున్నారే తప్ప ఏమాత్రం ప్రజలను పట్టించుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధిని పక్కనబెట్టేశారు. అమరావతిని భుజాన వేసుకుని ప్రజల నోరుకొడుతున్నారు.

రూ.1,200 కోట్లు ఏమయ్యాయి?

కుప్పం నియోజకవర్గ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం రూ.1,200 కోట్లు మంజూరు చేసినట్టు జబ్బలు చరుస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ హయాంలో వేసిన మురుగునీటి కాలువలు, రోడ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసింది శూన్యమే. నియోజకవర్గంలో బియ్యం, ఇసుక, గ్రానైట్ అక్రమ వ్యాపారాలు మితిమీరుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ టీడీపీ నాయకులు దోచుకుతింటున్నారు. గతంలో విమానాశ్రయం కోస 1,500 ఎకరాలు స్వాధీనం చేసుకుని ఒక్క పనీ చేపట్టలేదు. ప్రస్తుతం అధనంగా పారిశ్రామిక కారిడార్ నిర్మాణం అంటూ రైతుల వద్ద నుంచి వ్యవసాయ భూములను లాక్కున్నారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో భూములు కోల్పోయి చాలా మంది రోడ్డునపడ్డారు. పారిశ్రామక కారిడార్ పేరిట భూములు లాక్కునే ప్రయత్నం చేయడం చాలా దుర్మార్గం.

కుప్పంలో శ్రుతిమించుతున్న టీడీపీ ఆగడాలు

కుప్పం నియోజకవర్గంలో టీడీపీ నేతల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. రామకుప్పం ఎంపీపీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పూర్తి స్థాయి మెజారిటీ ఉన్నా ప్రలోభాలు పెట్టి ఆరుగురు ఎంపీటీసీలను తమ వైపు తిప్పుకున్నారు. అడ్డదారిలో ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. అదేవిధంగా కుప్పం మున్సిపాలిటీలోనూ వైస్సార్‌సీపీకి పూర్తి స్థాయి మెజారిటీ ఉన్నా కొన్సిలర్లను ప్రలోభాలు, భయభ్రాంతులకు గురిచేసి తమ వైపుకు తిప్పుకున్నారు. ఈ రెండు ఎన్నికల్లోనూ దొడ్డిదారిన టీడీపీ గెలిచినా నైతిక విజయం మాత్రం వైఎస్సార్‌సీపీదే.

క్లుప్తంగా

రోగులకు మెరుగైన వైద్యం

బంగారుపాళెం: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి ఆదేశించారు. గురువారం బంగారుపాళెం సీహెచ్‌సీ, తుంబకుప్పం పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని ఆదేశించారు. రోగులకు అందించే సేవల వివరాలను ఈహెచ్‌ఆర్(ఎల్రక్టానిక్ హెల్త్ రికార్డ్స్)లో నమోదు చేయాలని సూచించారు. సస్పెక్ట్ కేసులను వైద్యాధికారి ధ్రువీకరించి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స అందించి పర్యవేక్షించాలని తెలిపారు. చంటి బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని తెలిపారు. డీపీఎంఓ డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనుషా పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలే లక్ష్యం

- ఏపీఈసెట్‌లో 8వ ర్యాంకు సాధించిన జీవ



తల్లిదండ్రులతో జీవ

వెదురుకుప్పం: కొత్త ఆవిష్కరణల వైపు దృష్టి సారిస్తానని ఏపీఈసెట్ 8వ ర్యాంకర్ జీవ స్పష్టం చేశాడు. మండలంలోని సీఆర్‌కండ్రిగ దళితవాడకు చెందిన మరకాలకుప్పం దేవరాజులు, సత్తెమ్మది వ్యవసాయ కుటుంబం. వీరికి ముగ్గురు సంతానం. ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వీరి రెండవ కుమారుడు ఎం.జీవ తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో 2024లో డీఫార్మసీ పూర్తిచేశాడు. ఈనెల 6న జరిగిన ఏపీ ఈసెట్‌లో ఫార్మసీ మెడిసిన్‌లో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. భవిష్యత్‌లో ఫార్మా ఇండస్ట్రీస్‌లో కొత్త ఆవిష్కరణలు(రీసెర్చ్) చేయాలనే కృత నిశ్చయంతో ఉన్నట్లు జీవ పేర్కొన్నాడు. బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ చేసి పీహెచ్‌డీతో డాక్టరేట్ సాధించలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన చిత్తూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. శాంతమ్మ జార్ఖండ్‌కు చెందిన గోపి(64) చిత్తూరు నగరంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. గురువారం సాంబయ్యకండ్రిగ సచివాలయ పరిసరాల్లోని ముళ్లపదల్లో ఓ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయి ఉండడంతో స్థానికులు గుర్తించారు. పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి చనిపోయి ఉన్నట్లు తెలుసుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళ అదృశ్యం

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం పంచాయతీకి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం నుంచి కనబడడం లేదని పేర్కొన్నట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9440900687 నంబర్‌కి ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

చేయి తడిపితే.. ఆడనే చంపేస్తాం!

చిత్తూరు కేంద్రంగా లింగనిర్ధారణ పరీక్షలు

- కలెక్టర్ కల్పించుకుంటే తప్ప బయటపడని బండారం
- వైద్యశాఖ.. ఖాకీలకు మామూళ్లు వెళ్లడమే కారణమా?

చిత్తూరు అర్బన్: ఆడపిల్లల్ని అమ్మ కడుపులోనే గుర్తించి, బయటకు రాకమునుపే మట్టుబెడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి చిత్తూరు పట్టణంలో విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు. ఆడ బిడ్డ అని తెలిస్తే అంతం చేస్తున్నారు. దీని వెనుక వైద్యారోగ్యశాఖ, పోలీసు, ఇతర శాఖల అధికారుల మామూళ్ల మత్తే కారణమని స్పష్టమవుతోంది. చేయి తడిపితే చాలు.. 'ఆడ'నే చంపేస్తామని చాటిచెప్పడం విస్మయానికి గురిచేస్తోంది.

వారంలో మూడు రోజులు

ఆడ పిల్లల్ని వద్దనుకుంటున్న తల్లిదండ్రుల్లో 90 శాతం మంది రెండో కాన్పు, మూడో కాన్పుల్లో గర్భంలో ఉన్నది ఏ బిడ్డో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. తమిళనాడులో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలను పక్కాగా అమలు చేస్తుండడంతో అక్కడి నుంచి పలువురు చిత్తూరు బాట పడుతున్నారు. చెన్నై, విల్లూపురం, తిరుపత్తూరు, ధర్మపురి, కృష్ణగిరి, రాణిపేట, తిరువణ్ణామలై, వేలూరు, కాట్పాడి ప్రాంతాల నుంచి చిత్తూరుకు వస్తున్నారు. చిత్తూరులో వారానికి మూడు రోజులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండడంతో గర్భిణులను ఇక్కడకు తీసుకొచ్చేందుకు మధ్యవర్తులను నియమించుకుంటున్నారు. నెలలో మూడు సార్లు మాత్రమే ఓ చోట క్యాంపు పెట్టే నిర్వాహకులు, మరుసటి నెల మరోచోటికి గుడారాన్ని మారుస్తున్నారు.

ఆ అదృశ్య శక్తి ఎవరు?

లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు చేయడమంటే అంత సులువైన విషయం కాదు. వైద్యశాఖలో మంచి పరిచయాలు, ఖాకీలతో చనువు తప్పనిసరి. స్వయానా కలెక్టర్ రంగంలోకి దిగి నిందితులను పట్టుకున్నారంటే.. జిల్లా అధికారుల నిర్లక్ష్యం ఇక్కడ ఏ పాటిదో స్పష్టంగా కనిపిస్తోంది. వైద్యశాఖలో కింది స్థాయి సిబ్బంది ప్రమేయం, పోలీసుశాఖలో కానిస్టేబుల్ స్థాయి వ్యక్తులకు మామూళ్లు ఇస్తూ లింగ నిర్ధారణ పరీక్షలు నగరంలో నిర్వహిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. పేరుకు ముగ్గురు పట్టుబడ్డా, ఇంతటి వ్యవహారం నడిపించాలంటే చాలా పెద్ద నెట్‌వర్క్ ఉండాల్సిందే. మధ్యవర్తులు, స్కానింగ్ యంత్రాలు, అధికారులను మెయింటెన్ చేయడం లాంటివి చేస్తున్న పెద్దలు తెరవెనుక ఎవరున్నారో పోలీసుల దర్యాప్తు తేలాల్సి ఉంది.

నిద్దరోతున్న 'డెమో'

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో స్కానింగ్ సెంటర్లు, లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యల నివారణ బాధ్యత డెమో (జిల్లా ఎక్స్‌టెన్షన్ మీడియా విభాగం)పై ఉంది. కానీ ఇక్కడున్న అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తులో నిద్రపోతున్నారనే ఆరోపణలు న్నాయి. తమిళనాడులోని వైద్యశాఖ అధికారులు చిత్తూరులో జరుగుతున్న వ్యవహారంపై సమాచారం ఇచ్చేంత వరకు ఇక్కడి అధికారులకు తెలియపోవడం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనితీరును ప్రశ్నిస్తోంది. మాత శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖను సమన్వయం చేసుకుని నిత్యం ఇలాంటి పరీక్షలు నిర్వహించే వారిపై దాడులు, తనిఖీలు చేయాల్సిన వైద్యారోగ్యశాఖ మామూళ్ల మత్తులో జోగుతున్నట్టు స్పష్టమవుతోంది.

వసతుల కల్పనలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు విచ్చేసే పర్యాటకుల వసతుల కల్పన విషయంలో అలసత్వం వద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకరంగం అభివృద్ధికి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారితో చర్చించాలన్నారు. అందుకు అవసరమైన ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

నిర్మాణాలు పరిశీలించాలి

జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ప్రతి ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇంటి నిర్మాణాల పురోగతిని తప్పనిసరిగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ శాఖ అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకంలో జిల్లాలో మంజూరు చేసిన గృహాలను వేగవంతంగా చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు రూఫ్ లెవెల్, రూఫ్ లెవెల్ కాస్ట్ లో ఉన్న గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలకు రెండు రోజుల్లో 10 గ్రామాలను పరిశీలించి మెటీరియల్ కాంపొనెంట్ లో చేపట్టే పనుల వివరాల నివేదికను డ్వామా పీడీ సమర్పించాలన్నారు. సమీక్షల్లో డీఎఫ్ఓ భరణి, పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరి, జిల్లా దేవదాయశాఖ అధికారి చిట్టెమ్మ, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డ్వామా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

మొగిలి దేవస్థానం అభివృద్ధికి ప్రణాళికలు

జిల్లాలో మొగిలి దేవస్థానం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కుప్పంలోని ననియాల ఎకో టూరిజం, కంగుంది, పాలారు రివర్ ప్రాంతాల్లో అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. కాణిపాకం, బోయకొండ దేవస్థానాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి, ప్రసాదం స్కీంకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు వెల్లడించారు.

స్నేహితుడే కత్తితో పొడిచాడు

చిత్తూరు అర్బన్: పోలీసులకు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందించాడన్న కక్ష్యతో ఓ యువకుడిని స్నేహితుడే కత్తితో పొడిచిన ఘటన చిత్తూరు నగరంలో చోటు చేసుకుంది. చిత్తూరు నగరంలో బుధవారం రాత్రి జరిగిన గంగజాతర నిమజ్జన వేడుకలో మిట్టూరుకు చెందిన రాకేష్(28)పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడిచేశారు. ఈ దాడిలో రాకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అతన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కత్తితో పొడిచిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కాగా కత్తితో పొడిచిన వ్యక్తులు రాకేష్‌కు స్నేహితులు. ఇటీవల గంజాయి విషయంలో పోలీసులకు సమాచారం అందిచాడనే నెపంతో బాధితుడిపై ఈదాడి చేశారని పోలీసులు చెబుతున్నారు.

టీడీపీ నాయకుడి తీరుపై నిరసన



కూటమి నాయకుడు అడ్డుకోవడంతో నిలిచిపోయిన కాలువ నిర్మాణం

గంగాధర నెల్లూరు: ఓ టీడీపీ నాయకుడి తీరుపై నిరసనకు దిగిన ఘటన మండలంలోని పాపిరెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. గురువారం గ్రామంలోని ఓంశక్తి ఆలయానికి అనుబంధంగా మురుగునీటి కాలువ నిర్మాణానికి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీకారం చుట్టారు. ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నేత రుషేంద్రరెడ్డి కాలువ ఏర్పాటును అడ్డుకున్నారు. దీనిపై గ్రామస్తులు నిరసనకు దిగారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు గ్రామంలో అభివృద్ధి పనుల చేపట్టడాన్ని ఓర్వలేక సదరు నేత ప్రభుత్వ అధికారులను అడ్డుపెట్టుకుని కాలువ పనులను అడ్డుకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. వేలంలో ఆలయ మాన్యం భూమిని దక్కించుకున్న సదరు నేత ఉద్దేశపూర్వకంగా కాలువ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నట్టు తెలిపారు. ఈ విషయంపై ఎంపీటీసీ సభ్యురాలు భారతి మాట్లాడుతూ తక్షణం కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి స్పందిస్తూ రెండు మూడు రోజుల్లో గ్రామసభ పెట్టి తీర్మానం చేస్తామన్నారు. అలాగే వంక పోరంబోకు భూమి అన్యాక్రాంతం అయిందని, కూటమి నాయకులు ఇచ్చిన ఫిర్యాదులను సైతం పరిశీలించి రెవెన్యూ అధికారుల డిక్లరేషన్‌తో నిర్మాణ పనులు చేపట్టకోవచ్చని తెలిపారు.

ఉచిత ఫుట్‌బాల్ వేసవి శిబిరం

తిరుపతి సిటీ : స్థానిక ఇస్కాన్ టెంపుల్ సమీపంలోని టీటీడీ వినాయకనగర్ క్వార్టర్స్ గ్రౌండ్‌లో 8 నుంచి 18 ఏళ్ల లోపు వయస్సుగల బాల , బాలికలకు ఉచితంగా ఫుట్‌బాల్ శిక్షణ ఇస్తున్నట్లు కోచ్ లోకేష్ తెలిపారు. క్రీడల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఖాళీల గుర్తింపునకు కసరత్తు

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీచర్ల ఖాళీలకు కుస్తీ
- ఇప్పటి వరకు 7 వేల పోస్టులు గుర్తింపు



ఖాళీలు గుర్తిస్తున్న విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాలలు పున:ప్రారంభమయ్యేలోపు టీచర్ల ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. త్వరలో టీచర్ల బదిలీల షెడ్యూల్ విడుదల చేయనుండడంతో ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. వేసవి సెలవుల్లో కుటుంబీకులకు దూరంగా ఉంటూ కసరత్తు చేస్తున్నా ఉన్నతాధికారుల నుంచి ఛివాట్లు తప్పడం లేదని విద్యాశాఖ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులుగా కుస్తీ

గత వారం రోజులకు పైగా చిత్తూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని బదిలీల కసరత్తు నిర్వహిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్ 2 హెచ్‌ఎంలు ఒకే పాఠశాలలో ఐదేళ్లు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్జీటీలు ఎనిమిదేళ్ల ఒకే చోట పనిచేస్తే విధిగా బదిలీ కావాల్సి ఉంటుంది. వీరితో పాటు మిగిలిన టీచర్లు, హెచ్‌ఎంలు ఐచ్ఛిక బదిలీకి దరఖాస్తులు చేసుకోవచ్చు. జిల్లాలో కచ్చితంగా బదిలీ కావాల్సిన గ్రేడ్–2 హెచ్‌ఎంలు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్జీటీలు 4,478 మంది వరకు ఉన్నారు.

సమాచారం

క్లియర్ ఖాళీ పోస్టులు:	1,500
8/5 సంవత్సరాలు పూరైన పోస్టులు:	3,000
సర్‌ప్లస్, కొత్త పోస్టులు:	500
పున:వ్యవస్థీకరణలో గుర్తించిన పోస్టులు:	2,000
ఇప్పటి వరకు గుర్తించిన ఖాళీ పోస్టులు:	7,000

7 వేల ఖాళీల గుర్తింపు

కసరత్తులో ఈ నెల 15వ తేదీ వరకు 7 వేల పోస్టుల వరకు ఖాళీగా ఉన్నట్టు గుర్తించారు. క్లియర్ వెకెన్సీలు 1,500, ఎనిమిది, ఐదేళ్ల పూర్తయిన ఖాళీలు 3 వేలు, సర్‌ప్లస్, కొత్త పోస్టులు 500, పాఠశాలల పున:వ్యవస్థీకరణ కసరత్తులో కొత్తగా, సర్‌ప్లస్, బదలాయింపు పోస్టులు 2 వేలు మొత్తం 7 వేల వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గుర్తించినట్లు విద్యాశాఖ అధికారులు సూచించారు. ఈ ఖాళీల సంఖ్య కసరత్తు పూర్తి అయ్యే సరికి మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పకడ్బందీగా కసరత్తు



రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సూచించిన ప్రకారం బదిలీలు, ఉద్యోగోన్నతుల కసరత్తు పకడ్బందీగా చేపడుతున్నాం. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రక్రియ నిర్వహిస్తున్నాం. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పోస్టుల ఖాళీల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేశాం.

– వరలక్ష్మి, డీఈవో, చిత్తూరు

విహారం.. విషాదం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాత్రికులు

- పలువురు యాత్రికులకు అస్వస్థత
- ఓ వృద్ధురాలి మృతి



మృతి చెందిన మునిలక్ష్మమ్మ

ఇచ్ఛాపురం(శ్రీకాకుళం): తీర్థయాత్రకు బయల్దేరిన చిత్తూరు వాసులకు విషాదం ఎదురైంది. యాత్రికులు అస్వస్థతకు గురయ్యారు. ఒకరు మృతి చెందారు. చిత్తూరు జిల్లా, పెద్ద పంజాణి మండల పరిధిలోని గోనుమాకులపల్లితో పాటు మరికొన్ని గ్రామాలకు చెందిన 46 మంది ఓ ప్రైవేటు ట్రావెల్స్ ద్వారా ఈ నెల 8న తీర్థయాత్రలకు బయల్దేరారు. దారిలో స్వయంగా భోజనాలు సిద్ధం చేసుకుని తినేవారు. కాశీ, అయోధ్య దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈనెల 13న సాయంత్రం ఒడిశా సమీపించే సరికల్లా వీరిలో 30 మందికి వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గురువారం ఇచ్ఛాపురం చేరుకునేసరికి ఇంకా ఎక్కువ మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో వీరు అదే బస్‌లో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేరారు. వీరిలో పిచ్చుగల్లు మునిలక్ష్మమ్మ (69) ఆస్పత్రికి వచ్చేలోపే చనిపోయారని వైద్యులు పి.దేవేంద్రరెడ్డి తెలిపారు. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న వారు కోలుకుంటున్నారు. ఎండలు, లేదా కలుషిత ఆహారం వల్ల ఈ సమస్య తలెత్తి ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి చెల్లి తోటి గంగులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ బి.జగదీశ్వర రావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

500 గ్రాముల గంజాయి స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

నగరి : మండలంలోని వెంగన్నకండ్రిగ వద్ద 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు సీఐ విక్రమ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గురువారం ఉదయం గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం అందింది. సిబ్బంది శేఖర్, గజేంద్ర, సత్యతో పాటు, డిప్యూటీ తహసీల్దారు మేఘవర్ణం, రెవెన్యూ సిబ్బందిని వెంటబెట్టుకొని వెంగన్నకండ్రిగ వద్ద కాపుగాసి తనిఖీలు చేపట్టగా ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్‌లో నగరి టౌన్ నుంచి పొదటూరు పేట వైపుగా వెళ్తున్నారు. వారిని ఆపి తనిఖీ చేయగా.. వారి వద్ద 500 గ్రాముల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. విచారణలో తమిళనాడు పొదటూరుపేట, విలాసపురం చెందిన ధనుష్(21), అతనితో పాటు ఇద్దరు మైనర్లు కరకంటాపురం గ్రామానికి చెందిన పాత నేరస్తుడు మణికంఠ అనే వ్యక్తి దగ్గర తక్కువ డబ్బులకు గంజాయి కొనుక్కొని పొదటూరు పేటకి తీసుకెళ్లి ఎక్కువ డబ్బులకు అమ్ముతున్నట్లు కనుగొన్నారు. ఈ మేరకు వారిని అదుపులోనికి తీసుకొని, వారి వద్ద నుంచి సుమారు 500 గ్రాముల గంజాయి, మోటార్ సైకిల్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఆపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మణికంఠ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఎన్టీఆర్ వర్సిటీ వీసీతో ఎస్వీ ప్రిన్సిపల్ భేటీ

తిరుపతి తుడా : ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ చంద్రశేఖర్‌తో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతికి విచ్చేసిన ఆయనను గురువారం ఓ అతిథి గృహంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి సందర్శనకు రావాల్సిందిగా ఆహ్వానించారు. జులైలో రుయా, వైద్య కళాశాలల్లో పర్యటిస్తానని ఆయన చెప్పినట్లు ప్రిన్సిపల్ రవిప్రభు తెలిపారు.

అటవీ భూముల ఆక్రమణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమికి చెందిన ఓ నేత అటవీ భూమిని కబ్జా చేశాడు. యథేచ్ఛగా జేసీబీలతో చదును చేశాడు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు జేసీబీతోపాటు కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈఘటన చిత్తూరు మండలంలో చర్చనీయాంశమైంది. వివరాలు.. మండలంలోని బండపల్లి రెవెన్యూ ఎగువమాసాపల్లి ప్రాంతంలోని అటవీ భూములపై కూటమినేత కన్నుపడింది. రెవెన్యూ భూములను కూడా కబ్జా చేయాలని ప్రయత్నించాడు. బినామీ పేర్లతో రాసుకుని ఆక్రమణకు పాల్పడ్డాడు. ఎగువమాసాపల్లి ప్రాంతంలో 20 ఎకరాల భూమిని జేసీబీలతో చదును చేసే పనులు ప్రారంభించాడు. అలాగే అటవీశాఖ భూములను కాజేయాలని చూశాడు. ఈ విషయంపై గ్రామస్తులతో పాటు అదే పార్టీకి చెందిన కొందరు అటవీశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని అక్కడ చదును చేస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. అలాగే డ్రైవర్‌తో పాటు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులకు కూటమి నేతల నుంచి ఒత్తిడి ప్రారంభమైనట్లు తెలుస్తోంది. జేసీబీలను వదిలిపెట్టడంతో పాటు వ్యక్తులపై ఎలాంటి కేసులూ వద్దని ఆ శాఖ అధికారులను ఓ బడా నేత హెచ్చరించినట్టు సమాచారం.

చిత్తూరులో మెడికల్‌షాపు సీజ్



మెడికల్ షాపులో డ్రగ్స్ అధికారుల తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ మెడికల్ షాపును సీజ్ చేసి.. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన గురువారం చిత్తూరు నగరంలో చోటు చేసుకుంది. అక్రమంగా లింగ నిర్ధారణ చేస్తున్న ముఠాను కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అక్రమ నిర్వాహకులను పోలీసులకు అప్పగించారు. ఆపై పోలీసు విచారణను ముమ్మరం చేశారు. విచారణలో కొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటి ఆధారంగా డ్రగ్స్ కంట్రోల్ ఏడీ హరిప్రసాద్ రంగంలోకి దిగారు. పొన్నియమ్మ గుడివీధిలోని మెడికల్ షాపులపై మెరుపుదాడులు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టుబడ్డ మహిళల్లో చిత్తూరుకు చెందిన సునీత, తేజేశ్వరి ఉన్నారన్నారు. సునీత అనే మహిళకు పొన్నియమ్మ గుడివీధిలోని వినోద్ మెడికల్ షాపు, సుధా మెడికల్ షాపుకు సంబంధాలున్నాయని తెలిపారు. వినోద్ మెడికల్ షాపు నిర్వాహకుడు వినోద్ సునీత భర్తన్నారు. ఈ షాపును భార్యాభర్తలు ఇద్దరూ కలిసి కొన్నేళ్లుగా నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఈ షాపులో గాలించగా అబార్షన్ల కిట్లు గుర్తించామన్నారు. అలాగే వాడిన కిట్లు కూడా దొరికాయన్నారు. పెయిన్ కిలర్స్ ముందులు లభ్యమైనట్టు తెలిపారు. అంతకు ముందు చిరంజీవి అనే వ్యక్తి ఈ షాపును నడిపాడన్నారు. అతన్ని కూడా విచారించామన్నారు. డ్రగ్స్ అధికారులకు ఎలాంటి అనుమతి లేకుండా చిరంజీవి, వినోద్‌కు ఈ షాపు అప్పగించినట్లు తెలుసుకున్నామన్నారు. దీంతో వినోద్, చిరంజీవిపై కేసు నమోదు చేయడంతో పాటు షాపును సీజ్ చేసినట్టు వెల్లడించారు. సుధా మెడికల్ షాపులో కూడా తనిఖీలు చేపట్టామన్నారు. ఈ షాపులో మందులు, మాత్రల విక్రయాలకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేవన్నారు. ఇక శృంగార సామార్థ్యాన్ని పెంచే మాత్రలు బయటపడ్డాయన్నారు. వాటి విక్రయాలకు సంబంధించిన బిల్లులు లేవని, త్వరలో నోటీసులు ఇచ్చి తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.